విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

వ్యాపారాల్లేక విలవిల

విశాలాంధ్ర - జగ్గంపేట : వేసవిలో లభించే పండ్లు మామిడి పండ్లు. ఈ ఏడాది మామిడితోటలు ఆశాజనకంగానే ఉన్నాయి. ఈదురుగాలులు లేకపోవడంతో దిగుబడిబాగానే వచ్చింది. కాయ ఎదుగుతున్న దశలో గత నెలలో వర్షాలు కురిసాయి. ఆ వర్షాలకు మామిడి కాయలకు పురుగుపట్టింది. అధిక దిగుబడితో పాటు ఆదాయాన్ని ఇచ్చే బంగినిపల్లి రకానికి పురుగులు పట్టడంతో రైతుకు దిగుబడి వచ్చినా ధర తక్కువ పలుకుతోంది. బంగినిపల్లి తీపిగా ఉంటుందని ఎక్కువ శాతం ప్రజలు వాటినే ఇష్టపడతారు. పురుగులు పట్టడంతో కొన్ని కాయలు తోటల్లో రాలిపోగా, మిగిలిన కాయలు మార్కెట్‌లోకి పండ్లు తయారై వస్తున్నాయి. మార్కెట్‌లో కొన్న బంగినిపల్లి రకానికి పురుగులు ఉండటంతో ఒకసారి కొన్నవారు, మరొకసారి పండ్లు కొనటం లేదు. దీంతో జగ్గంపేటలోని మామిడి పండ్ల దుకాణాలు వెలవెలబోతున్నాయి. రోజంతా ఎండలో కూర్చుని అమ్మకాలు చేసినా రూ.400 కూలీ కూడా రావడంలేదని వారు వాపోతున్నారు.

సృజనాత్మకత పెంపునకు చిత్రలేఖనం దోహదం

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : విద్యార్థులలో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు చిత్రలేఖనం, చదరంగం పోటీలు దోహదపడతాయని గ్రామ సర్పంచ్ సాక శ్రీనివాస్ అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కపిలేశ్వరపురంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు స్థానిక శాఖ గ్రంథాలయంలో రాష్ట్ర ప్రభుత్వ వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వాటిలో వాతావరణ కాలుష్యం కారణంగా ప్రపంచ మానవాళికి జరగబోవు నష్టాలు, శబ్ద, జల, వాయు కాలుష్య నివారణ చర్యలకు సంబంధించిన చిత్రము, కన్నబిడ్డలపై తల్లిదండ్రుల మమకారం తదితర చిత్రాలను తిలకించిన సర్పంచ్ విద్యార్థులు అందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రెటరీ సాయి ప్రసాద్, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయురాలు లక్ష్మి పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

-బెంబేలెత్తుతున్న పట్టణ ప్రజలు

విశాలాంధ్ర - జగ్గంపేట : నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేట పట్టణంలో పట్టపగలే చోరీ జరిగింది. జగ్గంపేట పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన మంపాడ వీరబాబు ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు మధ్యాహ్న సమయంలో చొరబడి నగలు, నగదు చోరీ చేశారు. వీరబాబు కుమార్తె భవానీ చెప్పిన వివరాలు ప్రకారం నేను, అన్నయ్య నిద్రిస్తున్నామని, అమ్మ, నాన్నలు ఫంక్షన్‌కు వెళ్లారన్నారు. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువా పగలగొట్టి సుమారు 5 కాసుల బంగారు నగలు, 30 వేలు నగదు అపహరించారన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - అంబాజీపేట : 5 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న కోనసీమ ఆహారనిధి మజ్జిగ చలివేంద్రం మంగళవారం ఇరుసుమండ గ్రామంలో వీరంశెట్టి రాంబాబు, వీరంశెట్టి సతీష్‌ల చేతుల మీదుగా ప్రారంభించారు. 5 సంవత్సరాల కాలంలో కోవిడ్ లాంటి విపత్తులలో కూడా కోనసీమ ఆహారనిధి మజ్జిగ చలివేంద్రం నిర్వహించామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్ చీకట్ల, క్రాంతి, ధర్నాల ధన, సిద్దాబత్తుల రమేష్, రంకిరెడ్డి శ్రీనివాస్, రమేష్, వీరంశెట్టి వెంకటేశ్వరరావు, చంటి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బహిరంగ క్షమాపణలు చెప్పాలి

విశాలాంధ్ర - మండపేట : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దూలి జయరాజు మాదిగ డిమాండ్ చేశారు. మండపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జయరాజు మాట్లాడారు. ఈ నెల 21న విజయవాడలో అన్ని దళిత సంఘాల ఉద్యమ నాయకులతో టీడీపీ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసిందన్నారు. సమావేశానికి విచ్చేసిన తమ నాయకుడు మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలు కలవరపెడుతున్నాయని, దళితులు హత్యలకు గురవుతున్నారని, వాటిని పోలీసులు పట్టించుకోవడం లేదని, దళితుల రక్షణ కోసమైనా జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిందేనని పిలుపు నిచ్చారన్నారు. ఆ పిలుపుకి వైసీపీ నాయకులకు ఉలుకొచ్చి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. మందకృష్ణ పేమెంట్ ఆర్టిస్ట్ అని, పరాయి రాష్ట్రం వాడని విలువలు లేని వ్యక్తి అంటూ దూషించడంపై ఆయన తీవ్రంగా ఖండించారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీ తరపున దూలి జయరాజు మాదిగ డిమాండ్ చేశారు.

కుక్కల దాడికి మరో లేగదూడ బలి

విశాలాంధ్ర - మండపేట : పట్టణంలో కుక్కల దాడికి మరో లేగదూడ మృతి చెందింది. మున్సిపాలిటీలోని దాదాపు అన్ని వార్డుల్లో వీధి కుక్కలు అధికంగానే కనిపిస్తున్నాయి. ఇవి పగలంతా అక్కడ డక్కడా కనిపించి నప్పటికీ రాత్రిళ్ళు బయటకు వచ్చి వాటి ప్రతాపం చూపిస్తున్నాయి. పంట పొలాల దగ్గరలో ఉన్న పశువుల పాకల వద్ద కూడా అవి సంచరించి పశువులపై దాడికి పాల్పడుతున్నాయి. పది రోజుల క్రితం ఓ పాకలోకి చొరబడి లేగ దూడను పొట్టన పెట్టుకున్న సంఘటన మరువక ముందే మరో లేగ దూడను తీవ్రంగా గాయపరిచి వెళ్లిపోయాయి. సోమవారం ఇందిరాగాంధీ బైపాస్ రోడ్డులో ఉన్న పిల్ల కాలువ శివారు ప్రాంతంలో వీధి కుక్కలు పశువుల పాకలోకి చొరబడ్డాయి. పాకలో పడుకున్న లేగ దూడ మీద పడి ఇష్టం వచ్చినట్టు కరిచాయి. దూడను వెనక భాగంలో కరవడంతో రెండు కాళ్ళు చచ్చు బడి పోయి తీవ్రంగా బాధ పడి చివరికి ప్రాణాలు విడిచినట్టు పాడి రైతు గూనపు రెడ్డి కృష్ణ చెప్పారు. తక్షణమే మున్సిపల్ అధికారులు కుక్కలను నిర్మూలించాలని పట్టణ ప్రజలంతా ముక్త కంఠంతో కోరుతున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

-నిర్వాహకులు, విటుల అరెస్టు

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం సెంటర్లో హైవే పక్కనే గత కొద్ది రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై రావులపాలెం పోలీసులు సోమవారం దాడి చేసి ఇద్దరు నిర్వాహకులతో పాటు ఇద్దరు విటులను అరెస్టు చేయడం తీవ్ర సంచలనం కలిగించింది. ఇందుకు సంబంధించిన వివరాలను రావులపాలెం ఎస్ఐ ఎం. వెంకటరమణ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రావులపాలెం సిఐ రజనీకుమార్‌కు అందిన సమాచారం మేరకు రావులపాలెం సెంటర్‌లో హెచ్‌పి గ్యాస్ ఆఫీసు దగ్గరలో డోర్ నెంబర్. 2-344 గృహంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంపై రావులపాలెం సిఐ రజనీ కుమార్, రావులపాలెం ఎస్ఐ వెంకటరమణ సిబ్బంది వ్యభిచార గృహంపై దాడి చేసినట్టు తెలిపారు. రావులపాలెం గ్రామ పరిసర ప్రాంతాలలో విటులను ఆకర్షించి వారితో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. తాము నిర్వహించిన దాడిలో ఇద్దరు విటులను అదుపులోనికి తీసుకొని వారిపై రావులపాలెం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి వారిని కొత్తపేట కోర్టులో హాజరుపరచినట్టు తెలిపారు.

భారత్‌మాల పనులకు ప్రణాళికాయుత చర్యలు

కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా పరిధిలో భారత్‌మాల కింద మంజూరైన పనులను ప్రణాళికాయుతంగా చేపట్టి, వేగవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. భారత్‌మాల పరిధిలోని జాతీయ రహదారుల పనులపై మంగళవారం కలెక్టరేట్ కోర్టుహాల్‌లో కలెక్టర్ కృతికా శుక్లా.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్‌తో కలిసి జాతీయ రహదారులు, రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్, ఇరిగేషన్, గ్రామీణ నీటి సరఫరా, పరిశ్రమలు, పర్యాటకం తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పోర్టులను జాతీయ రహదారులతో అనుసంధానించే ప్రణాళికల్లో భాగంగా అచ్చంపేట జంక్షన్ నుంచి యాంకరేజ్ పోర్టు వరకు మంజూరైన దాదాపు 13 కి.మీ. నాలుగు లైన్ల జాతీయ రహదారి ప్రాజెక్టుపై చర్చించారు. డ్రెయిన్ల అవుట్‌లెట్లు, కల్వర్టులు, పైవంతెనలు, రైల్వే క్రాస్‌లు, అప్రోచ్ రహదారులు, పైపులైన్లు తదితరాలకు సంబంధించిన వివరాలను ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భవిష్యత్తులో కాకినాడ గ్రామీణం, పట్టణ ప్రాంతాలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకుండా, సమస్యలు ఎదురుకాకుండా ప్రణాళికాయుతంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. రహదారి నిర్మాణానికి అనుగుణంగా విద్యుత్ స్తంభాలను షిఫ్టింగ్ చేయాలన్నారు. డ్రెయిన్ వ్యవస్థ సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని.. నీరు ఎక్కడా నిలిచి పోకుండా చూడాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఇందుకు సంబంధించిన పనులపై ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. జాతీయ రహదారి ప్రాజెక్టు పనులు సజావుగా జరిగేందుకు వీలుగా ఎప్పటికప్పుడు సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించ నున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. సమావేశంలో కాకినాడ ఆర్‌డీవో బీవీ రమణ, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ డి.సురేంద్రనాథ్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం టి.మురళి, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు, డీఎఫ్‌వో ఐవీకే రాజు, కాకినాడ నగరపాలక సంస్థ ఎస్ఈ సత్యకుమారి, కాకినాడ అర్బన్ తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, కాకినాడ రూరల్ తహసీల్దార్ వి.మురార్జీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న పాల వెల్లువ

జూన్ నుండి ప్రారంభానికి కార్యాచరణ

విశాలాంధ్ర - అమలాపురం : జగనన్న రైతు భరోసాలో భాగంగా జగనన్న పాల వెల్లువ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో ప్రారంభమైందని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పాడి రైతులు ఆర్థిక స్వావలంబన సాధించే విధంగా బల్క్ మిల్క్ కేంద్రాలతో పాటు ఆటోమేటెడ్ మిల్క్ కలెక్షన్ యూనిట్లను జూన్ మాసంలో ప్రారంభించుకొనే విధంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు కలెక్టర్ హిమన్షు శుక్లా తెలిపారు. మంగళవారం అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయపు సమావేశ మందిరంలో పశుసంవర్ధక, సహకార శాఖ డిఆర్డిఏ చెందిన వివిధ విభాగాల అధికారులతో జగనన్న పాల వెల్లువ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోనసీమ జిల్లాలోని పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్న ఉద్దేశంతో పాటు దళారీల దోపిడి వ్యవస్థను అరికట్టడం, ప్రైవేట్ డైరీల పెత్తనం నివారించడానికి జగనన్న పాల వెల్లువ కేంద్రాలు దోహదపడతాయన్నారు. ఇప్పటికే ఈ కేంద్రాలు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో ప్రారంభమయ్యాయని జూన్ మాసంలో కోనసీమ జిల్లాలో ప్రారంభించే విధంగా కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలో 147 బల్క్ మిల్క్ కలెక్షన్ యూనిట్లు, 157 ఆటోమేటివ్ మిల్క్ కలెక్షన్ యూనిట్లు లక్షంగా ఉన్నాయన్నారు. జిల్లా స్థాయిలో ఇద్దరు పశుసంవర్ధక శాఖ ,ఇద్దరు సహకార శాఖ, ఇద్దరు డిఆర్డిఏ ప్రతినిధులతో కూడిన వారు జిల్లా స్థాయిలో ఏర్పాటు చేయనున్న కంట్రోల్ రూమ్‌లో ఉంటారని, వీరు గ్రామాల నుండి వచ్చిన సమాచారాన్ని జిల్లాలో ఏర్పడిన కోర్ కమిటీకి నివేదికను అందజేస్తారన్నారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జైపాల్ జగనన్న పాలవెల్లువ విజయవంతం అయ్యేలా కమిటీల నియామకం, డిఆర్డిఏ చెందిన మహిళ గ్రూపులో అవగాహన కల్పించడం లాంటి అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హాజరైన అధికారులకు వివరించారు.

వరదల నివారణకు కార్యాచరణ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రవిరాల వర్షాకాలానికి ముందు వరద నివారణ కార్యా చరణ ప్రణాళికకు సంబం ధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, వరదల నివారణకు లేదా ముంపును తగ్గించేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని కమిషనర్ సంబంధిత అధికారులకు సూచించారు. తూర్పు ఏలూరు, పేట కాలువ, గాడేరు పొడవునా కాలువల సర్వేను నీటిపారుదల శాఖ నిర్వహించి, సిల్ట్ తొలగింపు కోసం కమిషనర్‌కు సమర్పించింది. 29లోపు వరద ముంపు ప్రాంతాలలో ముంపును తగ్గించేం దుకు తక్షణ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ విభాగానికి కమిషనర్ సూచించారు. రుతుపవనాల సమయంలో వరదలను పూర్తిగా తగ్గించేందుకు శాస్త్రీయ అధ్యయనం నిర్వహించి, ఎన్ఐహెచ్, ఐఎస్‌టియు, ఇరిగేషన్ మరియు కెఎంసిలతో సంప్రదించి శాశ్వత పరిష్కారం కొనుక్కోవాలని సూచించారు.

కౌలు పత్రంతో రైతుకు ఇబ్బంది లేదు

విశాలాంధ్ర - శంఖవరం : కౌలు పత్రంతో భూ యజమానులకు ఇటువంటి ఇబ్బంది ఏర్పడ దని శంఖవరం మండల వ్యవసాయ శాఖాధికారి పి. గాంధీ రైతులకు సూచిం చారు. మంగళవారం శంఖవరం మండలంలోని కత్తిపుడి రైతు భరోసా కేంద్రం, వేళంగి, అన్నవరంలో కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌలు రైతులకు భూయజమానులు తమ ఆధార్, భూమి పాస్ పుస్తకం నకలు ఇవ్వడం వల్ల ఏ ఇబ్బందీ ఉండదని తెలిపారు. వారికి రావాల్సిన పథకాలు అన్నీ వస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె. సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి కే శ్రీనివాస్, విఆర్‌ఓలు, వ్యవసాయ సహాయకులు ప్రభాస్, చిన్నబాబు, మణికంఠ, రజాక్, రైతులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతి పని ప్రణాళికాయుతంగా చేయాలి

విశాలాంధ్ర - పెద్దాపురం : విద్యార్థులు చేసే ప్రతి పని ప్లానింగ్‌తో చేయాలని దాని ద్వారా ఉన్నత శిఖరాలను అందుకోవడానికి అవకాశం ఉంటుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెలికాని స్టాలిన్ అన్నారు. పెద్దాపురం యాసలపు సూర్యారావు భవన్‌లో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ (పిసిసి) ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. సమ్మర్ క్యాంప్‌ల ద్వారా ముందు చదివింది మరిచిపోకుండా, కొత్తగా చదువుపైన దృష్టి పెట్టడమే కాకుండా, సమాజంలో ఇతరులకు సహకారం అందించడానికి అవసరమైన ఆశక్తి పెరుగుతుందని అన్నారు. అన్ని తరగతుల పిల్లలు మంచి మిత్రులుగా అవ్వడానికి అవకాశం ఉంటుందని అన్నారు. జెవివి జిల్లా కార్యదర్శి రామారావు ఫన్నీ మ్యాథ్స్ చెప్పారు. సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు మ్యాథ్స్ బోధిస్తున్న ఎమ్ఎస్‌సి మూర్తి, నీలపాల బాల సుబ్రమణ్యం, కరాటే శిక్షణ ఇస్తున్న దుంగల పూజితా సూర్యశ్రీ, మ్యాజిక్ ఉపాధ్యాయులు బుద్దా శ్రీనివాస్‌లను ఆయన అభినందించారు. సమ్మర్ క్యాంప్ కో ఆర్డినేటర్ రొంగల అరుణ్, కూనిరెడ్డి అరుణ, అమృత, నమ్రత, మంజులా, సూరజ్, రవి కుమార్, జోత్స్న, రేణుక డి.కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ స్టాలిన్‌తో పాటు రేవతి సైన్స్ ఫౌండేషన్, రామచంద్రాపురం అధ్యక్షులు కృష్ణ సాయి, జెవివి సైన్స్ & టెక్నాలజి కన్వీనర్ బుద్దా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు బ్రాండ్ అంబాసిడర్లు వలంటీర్లు

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : ప్రభుత్వ పథకాలకు బ్రాండ్ అంబాసిడర్‌లు వాలంటీర్లు అని, రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చిన వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు అన్నారు. మంగళవారం స్థానిక సర్పవరం సెంటర్లో ఉన్న స్పందన హాల్లో డిఎల్‌పిఓ పాఠం శెట్టి నారాయణ అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మానస పుత్రికలు వలంటీర్లని కొనియాడారు. వాలంటరీ వ్యవస్థ ఏర్పడ్డాక ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించే అవకాశం ఏర్పడిందని తెలిపారు. రాబోయే కాలంలో ఈ వ్యవస్థను జగన్మోహన్ రెడ్డి మరింత పటిష్టం చేసి, వారికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా సర్పవరం గ్రామానికి చెందిన కొండేటి ఉషకు సేవా వజ్ర, తిమ్మాపురం గ్రామానికి చెందిన కోడి నాగుకు సేవా మిత్రా, కొవ్వూరు గ్రామ వాలంటరీకి సేవారత్న అవార్డులను కన్నబాబు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వైఎస్ఆర్ శ్రీను, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గోబిశెట్టి పద్మజా బాబ్జి, వైస్ ఎంపీపీ బందెల విరీష, సర్పంచులు బెజవాడ సత్యనారాయణ, రామదేవు చిన్న, శీలం చిన్న,ఉలవల వెంకటేశ్వర రావు, గొల్లపల్లి రాజు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు తోటకూర శ్రీనివాస్, గగారిన్‌తో పాటు పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులకు ఓటు నమోదు తప్పనిసరి

విశాలాంధ్ర - ఆలమూరు : అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు నమోదు ప్రక్రియ తప్పనిసరని కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.ముక్కంటి అన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా మండల కేంద్రమైన ఆలమూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కొత్తపేట నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారిగా ఆర్డీవో ముక్కంటి వ్యవహరిస్తూ ఉండగా, మండల అసిస్టెంట్ ఎలక్ట్రాల్ రిజిస్ట్రేషన్ అధికారిగా తహసీల్దార్ ఐపి. శెట్టి వ్యవహరిస్తూ మంగళవారం మండలంలో 18 గ్రామాల్లో ఉన్న 62 బూత్ సెంటర్లకు సంబంధించిన బూత్ లెవెల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరూ ఓటు గుర్తింపు కార్డు సేవలను ఉపయోగించుకోవాలని 18 సంవత్సరాల నిండిన యువతి, యువకులు నూతన ఓట్లను నమోదు చేసుకోవాలన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు గ్రామంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ఓటు గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానం, పేర్లు, చిరునామా మార్పులు, తప్పులు సవర్ణ, ఓటు ట్రాన్స్ఫర్ వంటి ప్రత్యేక సేవలపై దృష్టిపెట్టి ముందుకు సాగాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కే జాన్ లింకన్, కొత్తపేట ఎన్నికల సీనియర్ సహాయకురాలు అర్జమ్మ, వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీసీ ద్వారా విస్తృత వైద్య సేవలు

విశాలాంధ్ర - ఆలమూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ (ఎఫ్ పీసీ) ద్వారా విస్తృతమైన వైద్యారోగ్య సేవలు అందిస్తు న్నట్లు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోన సీమ జిల్లా వైద్యశాఖా ధికారి ఎం. దుర్గారావు దొర తెలిపారు. మండలంలోని పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 54 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కేటాయించిన ఎఫ్ పీసీ వాహనాల ద్వారా అత్యంత అనుభవం కలిగిన 108 మంది వైద్యులచే ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో నెలకు రెండు సార్లు చొప్పున సుమారు లక్ష మందికి సేవలు అందిస్తున్నామన్నారు. సాధారణ, దీర్ఘ కాలిక రోగులకు 72 రకాల మందులను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అనంతరం ఆస్పత్రి రికార్డులు పరిశీలించి వైద్యాధికారులు ఆర్ సుదర్శన్ బాబు, పి భవానీ శంకర్‌లకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ పి .వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవివి రాజా, సూపర్వైజర్లు పీవీ రమణారావు, పి ఉమ పాల్గొన్నారు.

మిషన్ పైనుంచి పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని మహిపాల చెరువు సమీపంలో లారీలో వెళ్తున్న వరి కోత మిషన్ నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి కృష్ణా జిల్లాకు చెందిన సికా సాయిబాబు (38)గా గుర్తించారు. మృతదేహాన్ని అమలాపురం ఏరియా హాస్పిటల్‌లో భద్రపరిచినట్లు పోలీసులు తెలియజేశారు.

ఆర్థికసాయం

విశాలాంధ్ర-బిక్కవోలు: అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం కాపవరం గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు పేలూరి వీరబాబు అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని అనపర్తి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు పరామర్శించారు. వారి కుటుంబానికి రూ.10,000, నియోజకవర్గ జనసైనికులు సమకూర్చిన 50 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇందల వీరబాబు, ప్రసాద్ రెడ్డి, గిరిజాల సత్తిబాబు, కోరడ రామారావు, జనసైనికులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్‌పై ప్రేమ...ఆటోవాలపై కక్ష

పోలీసుల తీరుపై మండిపడుతున్న ప్రజలు

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద రోడ్డుపై ఆటో ఆపినందుకు పోలీసు వీరంగం సృష్టించాడు. రోడ్డు పక్కన ఆటో ఆపినందుకు ఆటోను సీజ్ చేశారు. పెద్ద సెంటర్లో వందలాది మంది చూస్తుండగా ఆటో డ్రైవర్ పోలీస్ కాళ్లు పట్టుకుని వదిలేయమని ప్రాధేయపడ్డాడు. నిత్యం అమలాపురం రోడ్లపై ప్రైవేట్ ట్రావెల్స్ చేసే అరాచకాలు ఎన్నెన్నో. అమలాపురం బస్టాండ్ సమీపంలో ఉన్న కలశం వద్ద, ఈదరపల్లి వంతెన వద్ద రోజు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు రోడ్డు మధ్యలో పెట్టి ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తున్నా పట్టించుకోని అధికారులు ఆటో డ్రైవర్ పోలీసు అధికారిని కాళ్లు పట్టుకుని ప్రాధేయపడినా వదల్లేదు. ఈ దృశ్యాన్ని అక్కడే ఉన్న స్థానికులు మొబైల్‌లో చిత్రీకరించారు. పోలీస్ అధికారి తీరుపై చిన్నవాళ్లపైనే వీరి ప్రతాపాలంటూ పట్టణ ప్రజలు మండిపడుతున్నారు.

ఉపాధి హామీ కూలీలకు పూర్తి పని దినాలు కల్పించేలా చర్యలు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: ఉపాధి హామీ కూలీలతో గ్రామంలోని అమృత సరోవర్ చెరువును సుందరీ కరిస్తున్నట్లు దమ్మెన్ను సర్పంచ్ గురజర్ల వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. గత రెండు రోజులుగా జరుగుతున్న చెరువు తవ్వకం పనులను ఆయన మంగళవారం టెక్నికల్ అసిస్టెంట్‌తో కలిసి పర్యవేక్షించారు. చెరువు తవ్వకం సుమారు వారం రోజులపాటు జరుగుతుందని, రోజుకు 150 మంది కూలీల వరకు పనిచేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్ పి.లక్ష్మ నాయక్ ఉపాధి హామీ కూలీలకు పూర్తి పని దినాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలోని దమ్మెన్నులో చెరువు, మిగిలిన గ్రామాలలో పంట బోదెలు తవ్వకాలు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తెదేపా నాయకుడు దాసరి రత్నాజీ మృతి

విశాలాంధ్ర - చాగల్లు : తెలుగుదేశం పార్టీ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి వీర వెంకట రత్నాజీ (62) మంగళవారం మృతి చెందారు. ఈయనకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే రత్నాజీ ఆకాల మరణం తీరని లోటని మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు పేర్కొన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు ఆయన పార్థివ దేహానికి పార్టీ జెండా వేసి దహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మృతి పట్ల తెదేపా నాయకులు నాదేళ్ల శ్రీరామ్ చౌదరి, నందిగం శ్రీనివాస్, తాళ్ళూరి హరిశ్చంద్ర ప్రసాద్ తదితరులు సంతాపం ప్రకటించారు.

అంతర్రాష్ట్ర నేరస్తుడి అరెస్టు

విశాలాంధ్ర- బిక్కవోలు : అంతర్ రాష్ట్ర నేరుస్తుడిని బిక్కవోలు పోలీసులు అరెస్టు చేసినట్లు ఈస్ట్ జోన్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ ఎం. కిరణ్ కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన గంధవరపు గో పి 16న మండలంలోని బలభద్రపురం గ్రామంలో సేనాపతి సత్యవతి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో 72 గ్రాములు బంగారు ఆభరణాన్ని చోరీ చేశాడని, అనపర్తి లోను బంగారం చోరీచేసిన ట్టు నిందితుడు అంగీకరించాడన్నారు ఇతనిపై విజయనగరం తో పాటు రాష్ట్రం లోని పలుచోట్ల కేసులు నమోదు అన్నయని ఆయన తెలిపారు వేసవి కాలంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని తలుపులు కడియాలు వేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అనపర్తి సిఐ వి. శ్రీనివాస్, ఎస్ఐ పి.బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాపూజీ కలలు కన్న స్వరాజ్యం వలంటీర్లతో సాకారం

విశాలాంధ్ర- బిక్కవోలు : మహాత్మ గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం వలంటీర్ వ్యవస్థతో సాకారం అయ్యిందని వైఎస్సార్సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజి అన్నారు. మంగళవారం పందల పాకలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో సచివాల యం 1,2 వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా అప్పాజి మాట్లా డుతూ బడుగు, బలహీన వర్గాల ముంగిటకే సేవలు అందించాలన్న ముఖ్యమంత్రి జగన్ ఆలోచనల మేరకు పురుడు పోసుకున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. పందలపాక నుంచి సేవా రత్న అవార్డుకు ఎంపికైన సచివాలయం-1 వాలంటీర్ గొర్రిపోటీ మమత హేమ సురేష్, సచివాలయం-2 నుంచి కుక్కల కళ్యాణి అశోక్ కుమార్ ఎంపికయ్యారు. వారిని ఘనంగా సత్కరించి రూ.20వేల చొప్పున నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. కార్యక్రమంలో సోసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్ రెడ్డి, జెఏసీ మండల కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, ఎంపీటీసీలు కర్రి గీతా సతీష్ కుమార్, మచ్చా పాప అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమోద్‌కు సత్కారం

విశాలాంధ్ర - తాళ్లపూడి : మండలంలోని పైడిమెట్ట గ్రామానికి చెందిన వర్ధమాన కవి డాక్టర్ జొన్నకూటి ప్రమోద్ కుమార్, శ్రీ శ్రీ కళా వేదిక వారి అధ్వర్యంలో కర్నూల్‌లో టిజివి కళా క్షేత్రం వేదికగా జరిగిన 118 వ శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొని తన కవిత కాలుష్యం కోరల్లో గానం చేసి సత్కారం అందుకున్నారు. 150 మంది కవులు పాల్గొన్న ఈ కవి సమ్మేళనంలో శ్రీ శ్రీ కళా వేదిక అంతర్జాతీయ అధ్యక్షులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ సమన్వయ కర్త కొల్లి రమాదేవి, జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టే లలిత, రాష్ట్ర అధ్యక్షులు హరి సర్వోత్తమ రావు, కర్నూల్ శాఖ గౌరవ అధ్యక్షులు నారాయణ రెడ్డి మొదలగు ప్రముఖుల చేతుల మీదుగా ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందుకున్నారు. జనహిత సేవా సమితి సభ్యులు కిరణ్, రమేష్, శివ, నాగరాజు, మల్లి బాబు, మాణిక్యం, సత్యానందం, శేఖర్, జీకే తదితరులు ప్రమోద్‌కు శుభాకాంక్షలు అందచేశారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

విశాలాంధ్ర - సామర్లకోట : విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ సామర్లకోట పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మఠం సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై అధిక భారం మోపిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే బాబు, కౌన్సిలర్ బలుసు వాసు, నిమ్మకాయల కిరణ్, తాతపూడి కృష్ణబాబు, గొర్తి సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు దూరం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించి దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేయడం ద్వారా సీజనల్ వ్యాధులు దూరం అవుతాయని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి. లక్ష్మణరావు అన్నారు. మంగళవారం వెంకటరామన్నగూడెం, మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రముల పరిధిలోని

మోదుగుంటగుంట, పుల్లాయగూడెం గ్రామంలో జరుగుతున్న వెక్టర్ కంట్రోల్ హైజిన్ కార్యక్రమన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వై.వి. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యపరంగా అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఆహార నియమాలు పాటించాలన్నారు. నివాసిత ప్రాంతాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా పరిసరాలు పరిశుభ్రత పాటిస్తే దోమలు ద్వారా వచ్చే వ్యాధులతో పాటు సీజనల్ వ్యాధులను కూడా నియంత్రణ చేయవచ్చని అన్నారు. పాటించడం వారంలో ఒక్క రోజు డే ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టడానికి అవకాశం ఉందన్నారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్య, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులకు కళ్లెం వేయాలంటే ప్రతి ఒక్కరూ భాద్యతతో గృహాల వద్ద పరిశుభ్ర మైన వాతావరణంకల్పించుట ద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. శైలజ, ఆరోగ్య సహాయకులు హరనాథ్ బాబు, ఈ. కాంతారావు, భాస్కర రావు, ఎం. ఎల్. హెచ్.పి.లు, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి పాండురంగ, ఎం.ఎల్.హెచ్.పి, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పెరిగిన విద్యుత్ చార్జీల ధరలు తగ్గించాలని కోరుతూ గవరవరం విద్యుత్ ఉప కేంద్రం వద్ద టిడిపి నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న ప్రభుత్వ పరిపాలన తీరు

చూస్తుంటే రాబోవు రోజుల్లో సామాన్య మానవుడు బ్రతకాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేలా ఉందని, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచడంతో, కుటుంబాన్ని పోషించుకోలేక సతమతమవుతున్న సామాన్య ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచి రాష్ట్ర ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, విద్యుత్ కోతలు నిలిపివేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పారేపల్లి నరేష్, పట్టణ అధ్యక్షుడు జేష్ట రామకృష్ణ, పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు, యాగంటి హరిబాబు, సుధ గాని సత్యనారాయణ, నల్లూరు గోపి, తాతారావు ,కర్రీ సత్యనారాయణ, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో త్రాగునీరు సరఫరా

విశాలాంధ్ర - నిడమర్రు: నిడమర్రు మండలం చిననింద్రకొలను (పత్తేపురం) గ్రామ ప్రజలు త్రాగునీరు సమస్యతో ఇబ్బంది పడుతున్నారని జనసేన నాయకులు తెలియచేయగా వెంటనే స్పందించి శ్రీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకర్ ద్వారా

పాడి దిబ్బ శివారు ప్రాంత ప్రజలకు తాగునీరును సరఫరా చేశారు. ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్ చార్జ్ పత్సమట్ల ధర్మరాజు ఆర్థిక సహకారంతో వాటర్ ను అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు నడింపల్లి కళ్యాణ్ వర్మ,గ్రామ జనసైనికులు,తదితరులు పాల్గొన్నారు.

రంగు పేపర్లతో ఫోటో ఫ్రేమ్

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రంగు పేపర్లతో ఫోటో ఫ్రేమ్ లను తయారు చేయడం సులువుగా నేర్చుకోవచ్చని గ్రంథ పాలకురాలు యు.రాముడు పేర్కొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం 16 రోజులకు చేరుకోవడంతో విజ్ఞాన

శిబిరంలో విద్యార్థినీ విద్యార్థులకు గ్రంథ పాలకురాలు రాముడు పుస్తకాలు చదివించడం, రాయించడం, రంగు పేపర్లతో పువ్వులు తయారు చేయడం, ప్రత్యేక ఆకర్షణగా ఫోటో ఫ్రేమ్ లను తయారు చేయడం నేర్పించారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: విద్యుత్ కోతలను నిరసిస్తూ రాష్ట్ర తెలుగు దేశం పార్టీ ఆదేశాలు మేరకు మండల తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం టి నరసాపురం విద్యుత్ సబ్ స్టేషన్ ను ముట్టడించి టి నరసాపురం నుండి కామవరపుకోట వెళ్ళే రహదారి పై రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఎల్ఐఎఎస్ఎస్ ప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని ,అప్రకటిత కరెంటు కోతలను ఆపాలని,మోటార్లకు మీటర్లు బిగించడాన్ని విరమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, ఆచంట అనిల్ కుమార్, కొండపల్లి రవి, బొంతు సత్యనారాయణ,పెద్దిన సత్యనారాయణ, అగ్ని పర్తి భిక్షమయ్య, దాసరి చంద్రశేఖర్, కొల్లి రమేష్, కాసన్నేని మాధవ రావు, పెండ్యాల ప్రసాద్, దేవరపల్లి రంగారావు, పేరం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలకు నిరసనగా ధర్నా

విశాలాంధ్ర- తణుకు: పెరిగిన కరెంటు కోతలు, పెరిగిన విద్యుత్ చార్జీల కు నిరసనగా మంగళవారం తణుకు నియోజకవర్గంలో గల విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద టిడిపి ఇంచార్జ్,మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 7సార్లు విద్యుత్ చార్జీలను పెంచిందని విమర్శించారు.

విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలంటూ డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఎప్పుడు కరెంటు ఉంటుందో, ఎప్పుడు కరెంటు వస్తుందో తెలియని అయోమయ పరిస్థితిలో ఉంటుంన్నారని ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించి కోతలు లేని కరెంటును ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఇరగవరం మండల ప్రెసిడెంట్ గోపిశెట్టి రామకృష్ణ, ఆరేటి రామారావు, చవ్వాకుల సత్యనారాయణ, కునుకు సత్తిబాబు, సుబ్బిరెడ్డి, దత్తు రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పది

విశాలాంధ్ర -భీమవరంటౌన్ : అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని సుంకర పద్దయ్య వీధిలోని ఆంజనేయ స్వామి మహెూత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని సూచించారు. స్వామివారి మహెూత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. స్వామివారి మహెూత్సవాల ముగింపును పురస్కరించుకుని వేలాది మందికి అన్న సమారాధన చేయడం అంటే భగవత్ సేవతో సమానమని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ముందుగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

ఓటు బ్యాంక్ రాజకీయాలతోనే కొల్లేరు ఆక్రమణలు

విశాలాంధ్ర-మండవల్లి: సహజసిద్ధమైన ప్రకృతి వనరులను రక్షించుకోగలిగితేనే జీవరాశుల మనుగడ సాఫీగా సాగుతుందని విశ్రాంత చిత్రలేఖనోపాధ్యాయుడు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఏలూరు జిల్లా నాయకులు ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. మంగళవారం మండవల్లిలో మాట్లాడుతూ కొల్లేరు ఆపరేషన్ తదనంతరం కొల్లేరులో ఆక్రమణలకు పలువురు స్వార్దపరులు చక్రం తిప్పుతున్నారని చిత్తడి నేలలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. వన్యప్రాణులకు నెలవైన కొల్లేరులో ఓటుబ్యాంకు రాజకీయాలతో ఆక్రమణలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు కొల్లేరు ప్రాంతాన్ని,అక్కడి ప్రజల జీవన స్థితి గతులను మెరుగు పరచాల్సిన విషయాలను మరిచారని పర్యాటక క్షేత్రంగా కొల్లేరును అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరిగేవన్నారు.కొల్లేరులో ఆక్రమణలను అడ్డుకోవటంతో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా భాద్యతగా వ్యవహరిస్తే కొల్లేరుకు పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాజకీయనేతలు సైతం ఎన్నికల సమయాల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని కొల్లేరు పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని ఆక్రమణలను అడ్డుకోవాలని సూచించారు.

వాలంటీర్ల ద్వారా మేలైన సేవలు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: వాలంటీర్ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల వద్దకు తీసుకు వెళ్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ కే దక్కుతుందని చింతలపూడి శాసన సభ్యులు వి.ఆర్. ఎలిజా తెలియచేశారు. మంగళవారం స్థానిక రాజా రాణి కళ్యాణ మండపం లో రాష్ట్ర ప్రభుత్వం తరపున

జరిగిన వాలంటీర్లకు వందనం కార్యక్రమం మున్సిపల్ కమీషనర్ పి భవానీ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి చింతలపూడి శాసన సభ్యులు వి.ఆర్. ఎలీజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ఎలిజా మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థ ను ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకువచ్చి ప్రజల మన్ననలు పొందుతున్న ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాలంటీర్లను ఎమ్మెల్యే ఎలిజా సేవా వజ్ర,సేవా రత్న,సేవా మిత్ర అవార్డులతో ఘనంగా సత్కరించి,సర్టిఫికేట్ లు అందచేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి,వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు (అంజి),వైస్ చైర్ పర్సన్ కంచర్ల వాసవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర- జంగారెడ్డిగూడెం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చింతలపూడి ఎమ్మెల్యే వి.ఆర్. ఎలీజా అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారంతో 145 వ రోజుకు చేరుకుంది. స్థానిక 7 వ వార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న

ఎమ్మెల్యే ఎలీజా కు ఆవార్డు కౌన్సిలర్ దిరిసిపాము ధనలక్ష్మి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఎలీజా,అధికారులు,ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేస్తున్నామని, ఎవరైనా అర్హులు ఉంటే వెంటనే అధికారులు స్పందించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పేద,బడుగు,బలహీన వర్గాల ప్రజలకు అందచేసే సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంత వరకు మేలు చేశాయని బేరీజు వేసుకుని,ప్రజల సలహాలు,సూచనలు తీసుకుని రాబోయే సంవత్సరంలో మరింత ప్రజా రంజకమైన పరిపాలన అందించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం రూపొందించారని మన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, మున్సిపల్ కమీషనర్ పి.భవానీ ప్రసాద్, పట్టణ వైసీపీ అధ్యక్షులు పి పి ఎన్ చంద్రరావు,ఏలూరు జిల్లా వైసీపీ మహిళా విభాగ అధ్యక్షురాలు వందనపు సాయి బాల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ రైతు కూలీలతో జనసేన ముఖాముఖి

విశాలాంధ్ర - సీతానగరం : ఉపాధిహామీ రైతు కూలీలతో జనసేన ముఖాముఖి నిర్వహించింది. రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి మేడ గురుదత్త ప్రసాద్ ఆధ్వర్యంలో మండలంలో నలగొండ గ్రామంలో జనసేన జన జాగృతి యాత్రలో భాగంగా ఉపాధి హామీ పని చేస్తున్న రైతుకూలీలను ఉదయాన్నే వారి

దగ్గరకి వెళ్లి వారి గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు గురుదత్త ప్రసాద్‌తో మాట్లాడుతూ వారి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వర్షాకాలంలో మేము చాలా ఇబ్బందులు పడుతున్నామని తక్షణమే డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని మాకు జనసేన పార్టీ తరపున మీరు అండగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ మండల పార్టీ అధ్యక్షులు మండపాక శ్రీను, సీతానగరం మండల పార్టీ అధ్యక్షులు కారిచర్ల విజయ్ శంకర్, మండలం కో-కన్వీనర్ కాత సత్యనారాయణ,గొల్లకోటి కృష్ణ, దేవన కృష్ణ చదువు ముక్తేశ్వరరావు, గేదల సత్తిబాబు, తన్నీరు తాతాజీ, చదువు నాగేంద్ర, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మినీ మహానాడు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-దేవరపల్లి: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించి దేశం ప్రభుత్వ ఏర్పాటు చేసి ఎన్టీఆర్ శతజయంతి ఘన నివాళిగా అంద

జేస్తామని గోపాలపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మద్దిపాటి వెంకటరాజు వెల్లడించారు. దేవరపల్లి మండలం గౌరీ పట్నంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆంద్రు అనిల్ స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు తెలుగుదేశం పార్టీ మహానాడు ఈనెల 27 28 తేదీలలో రాజమండ్రిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మహానాడు తో పాటు అన్న ఎన్టీ రామారావు శతజయంతి వేడుకలు కూడా ఘనంగా నిర్వహిస్తున్నామని మద్దిపాటి తెలిపారు. ప్రతి మండలం నుండి నాలుగు నుండి ఐదు వేల మంది కార్యకర్తలను రాజమండ్రి మహానాడుకు వెళ్లే విధంగా సమాయత్తం చేస్తున్నామని తెలిపారు.

మహానాడు విజయవంతం చేయండి

విశాలాంధ్ర - పిఠాపురం : ఈనెల 27. 28 తేదీలలో రాజమండ్రిలో జరగబోవు తెలుగుదేశం పార్టీ మహానాడును విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే వర్మ పిలుపునిచ్చారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో పిఠాపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకుల, కార్యకర్తల సమావేశం మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రాజమండ్రిలో జరగబోవు మహానాడు పై చర్చించారు.

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి వెండి తొడుగు వితరణ

విశాలాంధ్ర - అంబాజీపేట : దశాబ్ద కాలంనకు పైగా పుల్లేటికుర్రు శివాలయంలోను, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయాలలో ఎన్నో దైవ కార్యక్రమాలు చేస్తున్న సర్వేజనా సుఖినోభవంతు ట్రస్టు

వారి ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పాన పట్టమునకు సుమారు నాలుగున్నర కిలోల వెండితో తొడుగును చేయించి, శాస్త్రోక్తంగా పండితులచే సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి, స్వామి వారికి అలంకరించారు. పుల్లేటికుర్తి లింగయ్య, వెలవలపల్లి వ్యాఘ్రి, వెలవలపల్లి సుబ్రహ్మణ్యం తదితరులచే నవగ్రహ శాంతి హెూమ, సంప్రోక్షణ కార్యక్రమానంతరం పానపట్టమునకు అలంక రించడం జరిగింది. సర్వేజనా సుఖినోభవంతు ట్రస్టు ప్రధాన కార్యదర్శి వక్కలంక రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైర్మన్ అయ్యగారి వ్యాఘ్రేశ్వర సతీష్ రాజు, కార్యదర్శి పొన్నాడ విశ్వనాథ్ రాజు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

టీడీపీ మండల కమిటీ నియామకం

విశాలాంధ్ర - కరప : కరప తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆదేశాల మేరకు ఎస్సీ మండల కమిటీ నియమించినట్టు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దేవు వెంకన్న తెలిపారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా జి. భావారం గ్రామానికి చెందిన గుండపు రాజేష్, మండల ప్రధాన కార్యదర్శిగా సవరపు సత్తిబాబు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలుగా కోన వెంకటలక్ష్మిని పార్టీ నియమించడం జరిగింది. తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు నాయకులు కార్యకర్తలు, కృషి చేయాలని దేవు వెంకన్న కోరారు.

అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద భారీ అన్నదానం

విశాలాంధ్ర - కిర్లంపూడి : కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడిలో వేంచేసి యున్న శ్రీ అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలను అభయాంజనేయ ఓల్డ్ ఐరన్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా

నిర్వహించారు. జయంతి వేడుకలను పురస్కరించుకొని గత వారం రోజులుగా ఆలయంలో ఆలయ అర్చకులు పొన్నా సుబ్రహ్మణ్య శర్మ బృందం ఆధ్వర్యంలో స్వామివారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి 24వ వార్షికోత్సవం, స్వామి వారి జయంతి వేడుకలను పురస్కరించుకుని స్వామివారిని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంతో పాటు కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబి, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు తదితరులు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆలయం వద్ద ఓల్డ్ ఐరన్ సంఘం ఆధ్వర్యంలో మూడు గ్రామాల భక్తులు, పెద్దలు, ప్రజలు సహాయ సహకారాలతో మంగళవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి కిర్లంపూడి,చిల్లంగి, జగపతినగరం గ్రామాలతో పాటు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని స్వామివారిని దర్శించుకోవడమే కాకుండా స్వామి వారి అన్న ప్రసాదము స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆరుగుల అర్జున, వేగి శ్రీనివాసరావు, యల్లపు రమణ, చల్లా సత్యన్నారాయణ, అబ్బు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న దాన కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు

విశాలాంధ్ర - చాగల్లు : మండలంలోని చంద్రవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉపాధ్యాయురాలు ఈ. జీ.వి సుబ్బలక్ష్మి విద్యార్థులచే గ్రంథాల

యంలో లభ్యమయ్యే దినపత్రికలు, పుస్తకాల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. విద్యార్థులతో పంచతంత్ర కథలు, మర్యాద రామన్న కథలు చదివించారు. విద్యార్థి దశ నుండే కష్టపడే తత్వాన్ని కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. చిన్నారులచే ఇంగ్లీష్ వర్డ్స్, వాటికి తెలుగులో అర్థాలు టేబుల్స్ చెప్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు కె.సుమన్ కుమార్, విద్యార్థిని విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు రామిశెట్టి

విశాలాంధ్ర-గంపలగూడెం : ఊటుకూరు గ్రామ సర్పంచిగా 35 సంవత్సరాలు ఏకధాటిగా పరిపాలించిన వ్యక్తి, ఆదర్శ కమ్యూనిస్టు రామిశెట్టి వేణుగోపాలరావు అని ఆయన సేవలు మరువలేనివని సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్

నాగుల్‌మీరా అన్నారు. మండలంలోని ఊటుకూరు గ్రామంలో మంగళవారం సీపీఐ కార్యాలయం భూపేష్ గుప్తా భవనంలో జరిగిన వేణుగోపాల్‌రావు 18వ వర్ధంతి సభలో ఆయన ప్రసంగించారు. గ్రామ పంచాయతీలకు ఎటువంటి ప్రభుత్వ నిధులు లేని రోజుల్లోనే ప్రజలను భాగస్వామ్యం చేసి గ్రామంలో పశువుల ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రి, గ్రంథాలయం, తాగునీరు, సాగునీరు కోసం తీవ్రంగా కృషి చేశారని కొనియాడారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ఊటుకూరు గ్రామాన్ని జిల్లాలో ఉత్తమ గ్రామ పంచాయతీగా రెండుసార్లు ఎంపిక చేసి అవార్డులు ఇచ్చిందని అన్నారు. ఆయన సేవలు ప్రజలు మరువలేనివని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నాగుల్‌మీరా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి మాధవరావు, రామిశెట్టి జయరాజు, సిద్ది వైకుంఠరావు, రామిశెట్టి సరస్వతి, బొమ్మన అనంత రాములు తదితరులు పాల్గొన్నారు.

బాపూజీ కలలు కన్న స్వరాజ్యం వలంటీర్లతో సాకారం

విశాలాంధ్ర - పెదపూడి : పూజ్య బాపూజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం వాలంటీర్లతో సాకారమయ్యిందని ఎంపీపీ కేతా తులసి అన్నారు. కైకవోలు, కుమారప్రియం, పెద్దాడ గ్రామాల సర్పంచులు నూని పట్టాభిరామన్న చౌదరి, డొకుబుర్ర మీనాక్షి అధ్యక్షతన సేవా రత్న, సేవా మిత్ర గ్రామ వలంటీర్లను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్సీపీ 2024లో మళ్లీ అధికారంలోకి రావాలంటే వలంటీర్లు మరింతగా మెరుగ్గా పని చేసి ప్రజల్లో జగన్ ప్రభుత్వంపై విశ్వాసం పెంచాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు నేరుగా పథకాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు అమలులో అవినీతి అక్రమాలకు తావులేకుండా ప్రజలకు చేరవేస్తూ ప్రభుత్వ ప్రతిష్టను పెంచుతున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీఓ కర్రి హరికృష్ణ సత్యరెడ్డి. ఉప సర్పంచి కొప్పిశెట్టి వీరశంకర్(పండు), కుమారప్రియం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పెమ్మనబోయిన సత్తిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు యాళ్ల మాధవి, వైఎస్సార్సీపీనాయకులు ఎల్లే సత్తిబాబు, పార్లమెంటు నియోజకవర్గం బీసీసెల్ కన్వీనర్ కేతా శ్రీను, పాలచర్ల రామకృష్ణ చౌదరి, డొకుబుర్ర కృష్ణ, సచివాలయం కార్యదర్శులు ఎం త్రినాథ్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్టమైన బందోబస్తు

విశాలాంధ్ర-కొవ్వూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన నేపథ్యంలో రోడ్ షో, సభా వేదిక వద్ద పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయ కర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం రాత్రి గ్యాలరీ ఇన్‌చార్జిలతో కలెక్టర్

మాధవీలత, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ లతో కలిసి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న విద్యా దీవెన కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. ఆ క్రమంలో రాష్ట్ర స్థాయి వేడుకకు వేదికగా కొవ్వూరు లో చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మే 24 బుధవారం ఉదయం 8.30 కు గుంటూరు జిల్లా తాడేపల్లి లోని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి హెలిప్యాడ్‌కు చేరుకుని అక్కడ నుంచి ఉ 8.40 కు బయలుదేరి కొవ్వూరు కు కే జీ ఎం హై స్కూల్ లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు ఉ.9.20 కు చేరుకుంటారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులను కలవడం జరుగుతుంది. అక్కడ నుంచి ఉ.9 30 కు బయలుదేరి రోడ్ షో గా సత్యవతి నగర్ లోని బహిరంగ సభ .. సభావేదిక కు ఉ.9.40 కు చేరుకుంటారు. ఉ.9.45 నుంచి ఉ.11.15 కు సభాస్థలి కార్యక్రమంలో అక్కడ లబ్ధిదారులతో ముఖాముఖి, ప్రముఖుల సందేశాలు, ముఖ్యమంత్రి సందేశం తదితర కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉ.11.20 కు సభా వేదిక నుంచి బయలుదేరి ఉ.11.30 కు కొవ్వూరు - హెలిప్యాడ్ కు చేరుకుంటారు. ఉ.11.30 నుంచి మ.12.00 వరకు స్థానిక ప్రజా ప్రతినిధులను కలుసుకుంటారు. మ.12.05 కు అక్కడ నుంచి బయలుదేరి తాడేపల్లి హెలిప్యాడ్ కు మ.12.45 చేరుకుని తదుపరి సిఎం క్యాంపు కార్యాలయం కు మ.12.55 కు చేరుకుంటారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయ కర్త , కలెక్టర్ లు ఆర్డీవో కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, ఆర్ ఎం సి మునిసిపల్ కె. తేజ్ భరత్, సహాయ కలెక్టర్ సీ. యశ్వంత్ కుమార్ రెడ్డి, ఆర్డీవో ఎస్. మల్లి బాబు, ఎ. చైత్ర వర్షిణి, ఇతర జిల్లా ఇతర జిల్లా అధికారులతో సమావేశం అయ్యారు.

ప్రజలను మభ్య పెట్టేందుకే
పోర్టుకు శంకుస్థాపన

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఎన్నికల ముందు పోర్టుకు శంకుస్థాపన చేసి లబ్ధి పొందాలని ఈ వైసీపీ ప్రభుత్వం చూస్తుందని మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ అన్నారు.చిత్తశుద్దిలేదని ప్రజలు వైఎస్ఆర్ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదని,అమలు కాని వాగ్దానాలు చేయుట విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. మంగళవారం స్థానిక జనసేన పార్టీ

కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు అవస్థలు పడుతున్నారని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారని పూర్తిస్థాయిలో వైద్యులను నియమించి పేద ప్రజల ప్రాణాలు కాపాడాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, రోడ్ల నిర్మాణం పట్ల దృష్టి సారించాలని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గడ్డం రాజు, గల్లా తిమోతి, వంపు గడవల చౌదరి, మహమ్మద్ సమీర్,దాదా, పినిశెట్టి వేణు,చిట్టూరి శివ ప్రసాద్, త్రిపురారి తరుణ్, ఈవన మణిబాబు, దేవర వీరబాబు, లంకె శ్రీనివాస్, ఉడుముల బుజ్జి, కొండా మేస్త్రి ,తోట భాస్కర్, శాయనశివ, బీరం సుదర్శన్, తోట రాజేష్, రామ్ జ్యోతి, గరికపాటి వెంకట్రావు, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ప్రోత్సాహం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలు, కళారూపాలకు జీవం పోసి భావితరాలకు వాటిని అందిస్తున్న పేద కళాకారులను ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తుందని, కళాకారుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కళాకారులకు మంజూరైన గుర్తింపు కార్డులను మంగళవారం కలెక్టర్ స్థానిక కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదరికంలో ఉండి అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నప్పటికి కళపై ఉన్న మక్కువతో కళా ప్రదర్శనలను కొనసాగిస్తూ సంస్కృతి, సాంప్రదాయాలకు జీవం పోస్తున్న కళాకారులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 58 ఏళ్ళు నిండిన నిరుపేదలైన కళాకారులకు నెలకు రూ.3 వేలు పెన్షన్ మంజూరు చేస్తుందన్నారు. అర్హులైన కళాకారులకు పెన్షన్ మంజూరు చేసేలా సాంస్కృతిక శాఖకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 200 మంది వృద్ధ కళాకారులకు పెన్షన్లను మంజూరు చేసినట్లు చెప్పారు. 3,463 మంది డప్పు కళాకారులకు గతంలో పెన్షన్లను మంజూరు చేసి నెలకు రూ.3 వేల చొప్పున రూ.1 కోటి 40 లక్షలు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా అందజేస్తున్నామన్నారు. జిల్లా అనేక మంది ప్రఖ్యాత కళాకారులకు జన్మనిచ్చిందని, వారి స్ఫూర్తితో అనేక మంది కళాకారులు ఇప్పటికి కళా ప్రదర్శనలను ప్రదర్శిస్తూ జీవితాన్ని కొనసాగిస్తున్నారన్నారు. కళాకారుల్లో ఎక్కువ మంది డప్పు కళపై ఆధారపడినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పండుగలు, జాతరలు, రాజకీయ సభలు, సమావేశాల సమయంలో మాత్రమే డప్పు కళాకారులకు జీవనోపాది లభిస్తుందన్నారు. డప్పు కళాకారులకు నృత్య గేయాలపై శిక్షణ అందించి వారి ప్రతిభను మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో జిల్లాకు చెందిన డప్పు కళాకారుల సేవలను వినియోగించుకునేలా అధికారులను ఆదేశిస్తామన్నారు. పౌరాణిక, సాంఘీక నాటక రంగాల్లో కళాకారుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో అర్హత కలిగిన కళాకారులకు గుర్తుంపు కార్డులను మంజూరు చేసి తద్వారా కళాకారులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసంబందాల అధికారి ఎస్వీ.మోహన్‌రావు, ఆడియో విజువల్ సూపర్‌వైజర్ ఎ.సాయిబాబా, కళాకారుల సంఘాల ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.